రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.19, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.38, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.20, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.21, అరటి కాయ రూ.10, చిక్కుడుకాయ రూ.75, చామ గడ్డ రూ.35, మునగ రూ.75, కందగడ్డ రూ.55, బీట్‌రూట్ రూ.21, కీర రూ.35, బీన్స్ రూ.115, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

దరఖాస్తుల ఆహ్వానం

చాదర్‌ఘాట్: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ద్వారా రాష్ట్రంలోని వికలాంగులకు ఉచితంగా ఉపకరణాలు, సహాయాలు అందజేయనున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. శుక్రవారం ఆమె మలక్‌పేటలో మట్లాడుతూ వికలాంగులు సంస్థ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అందజేయాలన్నారు. ప్రతి లబ్ధిదారునికి ఒక ఉపకరణం లేదా ఒక సహాయం మాత్రమే అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత జిల్లా సంక్షేమ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఆస్తిపన్ను చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎస్‌జీఎస్ నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ప్రాపర్టీ ట్యాక్స్ రూ. 2,91,648ల చెక్కును జీహెచ్‌ఎంపీ అధికారులకు శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎస్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరానికి ఎర్లీబర్డ్ స్కీంను ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: కొత్తపేటలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తోట నర్సింహయాదవ్, ఉపాధ్యక్షులు తోట కొమురయ్య యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు తోట మల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్

నాగోలు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగోలు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ భావితరాలపై ప్రభావం చూపుతుందన్నారు. మొక్కలను నాటి పరిరక్షించి పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల ముందు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించగలుగుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్, ఇన్‌చార్జి రవికుమార్ పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ సస్పెన్షన్

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6లో హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్‌ను (అవుట్ సోర్సింగ్) ఉద్యోగి సస్పెండ్ చేసినట్లు సర్కిల్–6 డిప్యూటి కమిషనర్ జయంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మలక్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ తప్పుడు జనన ధృవీకరణ పత్రాలు జారీ చేసినట్లు విచారణలో నిర్ధారణ అయినందున అతడిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కంచె వేయరు.. చెట్లు తొలగించరు!

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొంచి ఉన్న ప్రమాదం

- చెట్లు పెరిగిపోవడంతో కనిపించని ట్రాన్స్‌ఫార్మర్లు
- తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం, వనస్థలిపురం, లింగోజిగూడ, చంపాపేట డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాలలో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చాలానే ఉన్నాయి. దానికి తోడు చెట్లు పెరిగిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించడం లేదు. దీని వల్ల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. గాలికి చెట్ల కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్లకు తగలడంతో షార్ట్ సర్క్యూట్ అవుతోంది. విద్యుత్ శాఖ అధికారులు కేవలం స్తంభాల తీగలపై పడకుండా మాత్రమే కొమ్మలను కొట్టేశారు.



కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

◆ ట్రాన్స్‌ఫార్మర్‌లు తరుచూ ట్రిప్ కావడంతో ఫ్యూజ్‌లు పోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేయాలంటే సబ్‌స్టేషన్‌లో ఎల్‌పీ తీసుకుని వేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారు వచ్చే వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోతోంది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకుపోయిన చెట్లు

ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి..



విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి. ఎప్పుడు కరెంటు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి. – నవనీత, గృహిణి

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తదితరులు

నాగోలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాగోలులోని శుభం కన్వెన్షన్‌లో రంగారెడ్డి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యశాల సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ, వార్డు స్థాయిలోకి వెళ్లి ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించిన ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల విజయవంతమైన పాలనకు గుర్తుగా నేతలు, కార్యకర్తలు కలిసి మొక్కలు నాటారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ 11 ఏళ్ల మోదీ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. త్వరలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రజల మధ్యలో నిర్వహించి ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావాలని, యోగా దినోత్సవం, డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని. 50 ఏళ్ల ఎమర్జెన్సీ చీకటి అధ్యాయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి, శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదానం దేశ సమైక్యతకు నిలువెత్తు ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రబారి సుభాష్ చందర్ జీ, అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా కమిటీల కన్వీనర్లు ,కో కన్వీనర్లు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన



పట్టణ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో రాధాకృష్ణ

మలక్‌పేట: మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాగ్‌మూసారిమో ఉన్నత పాఠశాల, శాలివాహననగర్ ఉన్నత పాఠశాలలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా మూసారంబాగ్‌లో ఏర్పాటు చేసిన పట్టణ సభలో సైదాబాద్ జోన్ డిప్యూటీ ఈవో తిరునగరి రాధాకృష్ణ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అతున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారని, ఏఐ లాంటి సాంకేతిక సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పుస్తకాలు తదితర వసతులు కల్పిస్తుందన్నారు. పిల్లలను తప్పకుండా బడికి పంపించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న షేక్ మహమూద్, ఉపాధ్యాయులు

సైదాబాద్: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసేందుకు ఆయా స్కూళ్లల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని సీపీఐ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. శుక్రవారం ఆయన శంకేశ్వరబజార్ ప్రాథమిక పాఠశాల, సరశాదేవి హట్స్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణ అందించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందజేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని కోరారు. నిరుపేదలు తమ చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కోసం వారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సరశాదేవి హట్స్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భగవాన్ దాస్ నాయక్, శంకేశ్వరబజార్ పాఠశాల ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, సురక్షిత్‌రెడ్డి, ఎంవీ ఫౌండేషన్ నుంచి స్వాతి, శంకర్ నాయక్, అనంతమ్మ, పుష్పలత, లలిత, శ్రీలత, శ్రీకాంత్ పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ పూజలు

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధి కమలానగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో ఆలయ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, సభ్యులు సుబ్బారావు, గణేష్, దివాకర్, మదన్‌రెడ్డి, జగదీశ్వర్, శివయ్య, కిషన్‌రావు, నాయకులు పారంద మహేష్, ఎర్రవెల్లి సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

గాంధేయ వాదంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



జై బాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్న కోట్ల శ్రీనివాస్, దాసు

సైదాబాద్: ప్రజాస్వామ్య పరిరక్షణకు గాంధేయ మార్గంలోనే ముందుకు వెళ్లాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నాగారి గారి దాస్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజ్యాంగ విలువలపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ దేశంలో పేట్రేగిపోతున్న మతోన్మాద శక్తులను అంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ కాసుల బాలరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవిరాజ్, టీపీసీసీ కార్యదర్శి మామిడాల కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

ఘనంగా స్నేహపురికాలనీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వేదమంత్రాల మధ్య సాంప్రదాయబద్ధంగా స్వామి వార్ల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. శుక్రవారం దేవాలయంలో చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. స్వామి వారిని ఉభయ దేవేరులతో స్నేహపురి కాలనీ తదితర పురవీధుల్లో గురుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నాగోలు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నాగోలు డివిజన్ జైపురికాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాలలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.వేలల్లో ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి ఇబ్బందులు పడొద్దని, మంచి సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. బడిబాట షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు ఉంటాయని, గత సంవత్సరం కంటే ఈ విద్యాసంవత్సరం అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు సరస్వతి, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ, అంగన్‌వాడి టీచర్ లలిత మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాహెచ్.సత్తిరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వాసుగౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా భజన్‌నాయక్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సందీప్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సత్యనారాయణరెడ్డి, గిరిగౌడ్‌లను ఎన్నుకున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అభినందించి ప్రమాణ స్వీకారం చేయించారు.



రామాలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక..

కాలనీలోని రామాలయ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు కాలనీ వాసులు తెలిపారు.

రహదారి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో చేపట్టిన రహదారుల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె ఐఎస్‌సదన్‌లోని వైశాలీనగర్ కాలనీలో రూ. 12.20లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై స్థానికులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు, ఏమైనా అవకతవకలు చోటు చేసుకున్నట్లు గుర్తిస్తే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, బీజేపీ ఐఎస్‌సదన్ డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, కాలనీవాసులు కిషన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేష్, అచ్యుత్ పాల్గొన్నారు.

పార్కుల్లో పచ్చదనం పెంపొందించాలి

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని కాలనీల్లోని పార్కుల్లో పచ్చదనం పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆర్‌కేపురం, మార్గదర్శి కాలనీ అల్కాపురి, వాసవి కాలనీల్లో పర్యటించారు. కాలనీల్లోని పార్కులను సందర్శించిన కార్పొరేటర్ పార్కుల్లోని వసతులు, అక్కడ నెలకొన్న సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా హార్టికల్చర్ అధికారులతో కలిసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ప్లాస్టిక్ కవర్ల పంపిణీ

చాదర్‌ఘాట్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని జంతు కళేబరాలను తొలగింపునకు మసీదుల వద్ద సర్కిల్–6 పరిధిలో 40 వేల కవర్లు పంపిణీ చేసినట్లు ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మలక్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 66 లిఫ్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 20 లిఫింగ్ పాయింట్లను గుర్తించి, ఎప్పటికప్పుడు తొలగించేందుకు శానిటేషన్ సిబ్బందిని నియమించామన్నారు. సర్కిల్ పరిధిలో 30 భారీ వాహనాలు, 15 ఎక్స్‌కవేటర్లను, 10 టిప్పర్స్, భారీ వాహనాలు 18, మినీ టిప్పర్స్ 8 సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు.

సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీలో రూ. 40.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీగౌడ్, కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కవిత, హరిందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకాన్ని విజయవంతం చేయాలి



చెకొలేకర్ లక్ష్మి

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో 30 ఏళ్ల తర్వాత ఈ నెల 8న నిర్వహించనున్న మహా కుంభాభిషేకం ఉత్సవాలను విజయవంతం చేయాలని అందుకు మార్కెట్ అధికారులు సహకారాలు అందించాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో సహా హాజరుకావాలన్నారు.

మార్కెట్ పరిశుభ్రంగా ఉంచాలి..

మహా కుంభాభిషేక ఉత్సవా నేపథ్యంలో మార్కెట్, గుడి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని మార్కెట్ సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థులకు సన్మానం

హుడాకాంప్లెక్స్: ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఘనంగా సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలోనే అత్యుత్తమ నైపుణ్యత గల అధ్యాపకులు ఉంటారని, ప్రభుత్వం విద్యపై దృష్టి సారించడం వల్లే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతున్నామని చెప్పారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 979 మార్కులు సాధించిన మదియా తహసీన్‌ను, 950 మార్కులు సాధించిన పి.దార్తిలను సన్మానించారు. ప్రభుత్వ కళాశాలలో బోధన బాగుంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలని ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని కోరారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్రికల్చర్ కోర్సులో ఉన్నత విద్య అభ్యసించాలని ఉందని తహసీన్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, చంద్రయ్య, మేరీ, లలిత పాల్గొన్నారు.